సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 19 । మార్చి । 2025



రేక్ పాయింట్‌కు లైన్ క్లియర్

ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు సరఫరా చేసే వివిధ కంపెనీల ఎరువుల దిగుమతికి పందిళ్లపల్లిలో రేక్‌పాయింట్ ఏర్పాటు చేయనున్నారు. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం సా.) 6.25

సహర్ (గురువారం ఉ.) 4.57

వాతావరణం

గరిష్టం / కనిష్టం 38°/22°

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో వాతావరణం చల్లగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం కమనీయంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న అధ్యాపకులు

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు రావులపాటి వెంకటేశ్వర్లుకు కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. కేయూ సీనియర్ ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'డాక్టర్ సీతారాం సాహిత్యం – అధ్యయనం' అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య ఆధ్వర్యాన సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు, అధ్యాపకులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ నాగేశ్వరరావు, కృష్ణవేణి, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ రాకేష్ శ్రీరాం, డాక్టర్ రాజు, ఈశ్వర్, సురేందర్, సరిత, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, లక్ష్మణ్‌రావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు




సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

కొత్తగూడెంఅర్బన్: నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపడుతామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి భాస్కర్‌నాయక్ తెలిపారు. మంగళవారం కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ధరల పట్టికను ప్రదర్శించాలని, పనిచేసే వైద్యుల సర్టిఫికెట్లను ఫైల్ చేయాలని తెలిపారు. ఆయుష్ ఆస్పత్రులు, ఫిజియోథెరపీ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద రిజిస్ట్రేషన్ చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓతో పాటు డిప్యూటీ డెమో ఫయాజ్ మొహినుద్దీన్, పాయం శ్రీను, డిప్యూటీ పీఎంఓ తదితరులు పాల్గొన్నారు.

కవితా పోటీల కరపత్రాలు ఆవిష్కరణ

పాల్వంచ: పాల్వంచ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి కవితా పోటీలు నిర్వహించనున్నట్లు కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బిక్కసాని సుధాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, జాతీయ వాదం పరిణామాలు అనే అంశాలపై 30 లైన్లకు మించకుండా కవితలు రాసి ఈనెల 26వ తేదీ నాటికి 93993 24497, 98498 90322 నంబర్లకు పంపించాలని కోరారు. విజేతలకు నగదు బహుమతులు, సన్మానిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్, కొండల్ రావు, నర్సింహాకుమార్ పాల్గొన్నారు.

భట్టి.. గట్టి హామీలిచ్చేనా?



ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆర్థిక మంత్రి హోదాలో బుధవారం రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల తర్వాత వస్తున్న బడ్జెట్ కావడంతో వాస్తవిక అంచనాలతో స్థానిక డిమాండ్లకు తగ్గట్టుగా భట్టి నుంచి గట్టి హామీలే లభిస్తాయని జిల్లా వాసులు ఆశిస్తున్నారు.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

అసెంబ్లీలో కార్పొరేషన్ బిల్లు

కొత్తగూడెం – పాల్వంచ – సుజాతనగర్‌లను ఒక్కటిగా చేస్తూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుకు గత జనవరి 4న రాష్ట్ర కేబినెట్ అమోదం తెలిపింది. కాగా, కొత్తగూడెం, పాల్వంచలను కార్పొరేషన్‌గా మార్చేందుకు చట్టపరమైన చిక్కులు ఉన్నందున ముందుగా అసెంబ్లీ వెలుపల ఆర్డినెన్స్ తయారు చేయాలని నిర్ణయించారు. అయితే బడ్జెట్ సమావేశాలు దగ్గరలోనే ఉండడంతో ఆర్డినెన్స్ ప్రయత్నాలు పక్కన పెట్టారు. తాజాగా జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుకు ఉద్దేశించిన బిల్లును మంగళవారం సాయంత్రం ప్రవేశపెట్టారు. ఇక అప్పటికే సమావేశాలు ముగిసే సమయం కావడంతో దీనిపై చర్చ జరగలేదు. బుధవారం భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడతారు. గురువారం అసెంబ్లీకి సెలవు ఉంటుంది. శుక్రవారం సమావేశాలు ప్రారంభమైన తర్వాత బడ్జెట్‌పై చర్చ జరుగుతుంది. దీని మధ్యలో కొత్తగూడెం కార్పొరేషన్ బిల్లుపై చర్చించే అవకాశం ఉంది. అనంతరం బిల్లుకు మెజార్టీ సభ్యులు ఆమోదం తెలిపితే చట్టంగా మారుతుంది. అప్పుడు కొత్తగూడెం – పాల్వంచ మున్సిపాలిటీలు కలిసి కొత్తగూడెం కార్పొరేషన్‌గా రూపాంతరం చెందుతుంది.

నేటి రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల్లో ఆశలు

- కొత్తగూడెం – పాల్వంచ కార్పొరేషన్‌పై చర్చ జరిగేనా..?
- ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రకటనకు ఎదురుచూపులు
- భద్రాచల క్షేత్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వాలంటున్న భక్తులు

'యూనివర్సిటీ'కి నిధులు..

సింగరేణి బొగ్గు గనులను దృష్టిలో ఉంచుకుని.. ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న మైనింగ్ విభాగాన్ని 1978లో కొత్తగూడెం తరలించారు. ఆ తర్వాత కాకతీయ యూనివర్సిటీకి అనుబంధంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌గా మార్చారు. గడిచిన నాలుగు దశాబ్దాలుగా వేలాది మంది ఇంజనీర్లు ఈ కాలేజీ నుంచి బయటకు వచ్చి దేశ మైనింగ్ అవసరాలకు ఉపయోగపడ్డారు. అయితే నిధుల కొరత, పర్యవేక్షణ లేమి, అధ్యాపకులు రాకపోవడం, ల్యాబ్‌ల ఆధునీకీకరణ ఆగిపోవడం వంటి కారణాలతో కొన్నేళ్లుగా ఈ కాలేజీ గత ప్రాభవాన్ని కోల్పోతూ వస్తోంది. ఈ కళాశాల అభివృద్ధికి రూ.75 కోట్లు కేటాయించాలని రాష్ట్ర సర్కారుకు రెండేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపారు. అయితే గత రెండు బడ్జెట్‌లలోనూ ఈ ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. మరోవైపు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఇంతవరకు యూనివర్సిటీ లేదు. దీంతో కొత్తగూడెంలో ఉన్న ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో నిధుల మంజూరు లేదా యూనివర్సిటీ అప్‌గ్రేడ్ విషయంలో జిల్లాకు ఈ బడ్జెట్‌లో తీపి కబురు దక్కుతుందనే అంచనాలు ఉన్నాయి.

ప్రతిపాదనలు ముందుకెళ్లేనా ?

కొత్తగూడెం – పాల్వంచ పట్టణాల మధ్య జూ పార్కు ఏర్పాటు విషయంపై ఇప్పటికే అటవీ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. స్థలం ఎంపిక కూడా పూర్తయింది. ఇక్కడున్న నదులు, డ్యామ్‌లు, అడవులను దృష్టిలో ఉంచుకుని జూ పార్కు కూడా మంజూరు చేస్తే పర్యాటక రంగానికి మరింత ఊపు వస్తుంది. ఈ బడ్జెట్‌లో కొత్త జూ పార్కు ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. మరోవైపు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్‌ను కొత్తగూడెంలో స్థాపించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. ఇందుకు అనుగుణంగా ఈ బడ్జెట్‌లో రాష్ట్ర సర్కారు నుంచి ప్రకటన వస్తుందని ప్రజలు విశ్వసిస్తున్నారు.

భద్రగిరిపై దృష్టి పెట్టండి..

దక్షిణ అయోధ్యగా పేరున్న భద్రాచల పట్టణంలో మౌలిక సదుపాయల కొరత తీవ్రంగా ఉంది. తెలంగాణ వచ్చిన తర్వాత ఈ పట్టణ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయిస్తామని చేసిన ప్రకటన ఇప్పటికీ అమలు కాలేదు. ఇటీవల మంజూరైన నిధులన్నీ అసంపూర్తిగా ఉన్న కరకట్ట పనులకే సరిపోయాయి. దీంతో పట్టణంలో రోడ్ల విస్తరణ, పర్యాటక పరంగా అవసరమైన సుందరీకరణ, అహ్లాదకర ఏర్పాట్లు, బస, వసతి వంటి ఏర్పాట్లు చేసేందుకు నిధుల కొరత ఎదురవుతోంది. దేవాదాయ శాఖకు వచ్చే ఆదాయం ముక్కోటి, శ్రీరామనవమి ఏర్పాట్లకే సరిపోతోంది. దీంతో ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా భద్రాచలాన్ని తీర్చిదిద్దేలా ఈ బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం మంత్రి భట్టి అధికారులకు ఆదేశాలిచ్చారు. దీనికి కొనసాగింపుగా ఈ బడ్జెట్‌లో భద్రాచలానికి ఆర్థిక దన్ను దక్కుతుందని భక్తులు ఆశిస్తున్నారు.

జిల్లాలో సీపీఐకి ఆదరణ భేష్

పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా



మాట్లాడుతున్న రాజా

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో కమ్యూనిస్టు పార్టీకి ప్రజాదరణ మెండుగా ఉందని, ప్రజలపక్షం వహించే పార్టీలనే ప్రజలు ఆదరిస్తారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. మంగళవారం ఆయన జగదల్‌పూర్ నుంచి కొత్తగూడెం మీదుగా విజయవాడ వెళ్తూ.. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో రాజకీయ పరిస్థితులపై జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషాతో చర్చించారు. అనంతరం రాజా మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ నిర్వహించే ప్రజాపోరాటాలకు రాష్ట్రంలోనే ఈ జిల్లా అదర్శంగా నిలుస్తోందని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంతోమంది జాతీయ స్థాయి నాయకులను అందించిందని, ప్రజావాణి వినిపించే నేతలను చట్ట సభలకు పంపిందని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు జిల్లాలో పార్టీ విస్తరణకు, ప్రజాప్రతినిధిగా ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం శ్రమిస్తుండడం హర్షణీయమన్నారు. ఈ ఏడాది సకాలంలో సభ్యత్వాలు పూర్తి చేసిన జిల్లా నాయకత్వాన్ని అభినందించారు. సిపిఐ శత ఆవిర్భావ వేడుకలు వచ్చే ఏడాది డిసెంబర్ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఆయన వెంట సీపీఐ జాతీయ నాయకులు రామకృష్ణ పాండే తదితరులు ఉన్నారు.

పోడు భూములకు విద్యుత్ లైన్లు



విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ జితేష్ వి పాటిల్

అధికారులకు కలెక్టర్ ఆదేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా వ్యాప్తంగా పోడు వ్యవసాయం చేసే రైతులకు నీటి సౌకర్యం కోసం విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అధికారులతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోడు పట్టాలు పొందిన రైతుల సాగుకు వీలుగా నీటి వసతి కల్పించాలని, ఈ మేరకు విద్యుత్, అటవీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో తగిన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. విద్యుత్ లైన్లు సాధ్యం కాని పక్షంలో అటవీ శాఖ అధికారుల ఆమోదంతో బావులు తవ్వి సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. పోడు భూముల్లో ఆయిల్‌పామ్ సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధిహామీ పథకం లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. వ్యవసాయ భూముల్లో ఫామ్ పాండ్ తవ్వకాలపై రైతుల్లో అవగాహన కల్పించాలని, నిర్లక్ష్యం చేస్తే వ్యవసాయ శాఖ అధికారుపై చర్య తప్పదని హెచ్చరించారు. జలశక్తి అభియాన్‌లో భాగంగా పంచాయతీ పరిధిలోని ప్రతీ కార్యాలయం, పాఠశాలలు, రోడ్డు పక్కన ప్రాంతాలను గుర్తించి ఇంకుడు గుంతల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ఘనంగా నిర్వహించే బతుకమ్మ పండుగకు తంగేడు పువ్వు ఎక్కడా కనిపించడం లేదని, ఆమొక్కలు పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని నర్సరీల్లో ఇప్ప, కరక్కాయ, చింత, విషముష్టి, కుంకుడు, తంగేడు వంటి మొక్కలు పెంచాలన్నారు. గింజలు సేకరించే విద్యార్థులకు గ్రామస్థాయిలో రూ. 1,000, మండల స్థాయిలో రూ 5,000, జిల్లాస్థాయిలో రూ 50,000 బహుమతిగా ఇవ్వనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. వీసీలో అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, ఏడీఆర్‌డీఓ రవి, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనా, ఎస్సీ, బీసీ సంక్షేమాధికారులు అనసూర్య, ఇందిర, మిషన్ భగీరథ అధికారి నళిని పాల్గొన్నారు.

పిల్లల కలలకు రూపం ఇవ్వండి

కొత్తగూడెంఅర్బన్: పిల్లల కలలు, ఊహా శక్తికి సరైన ప్రోత్సాహం అందిస్తే వారి భవిష్యత్ బంగారుమయం అవుతుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లా స్థాయి బాలమేళా ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తీసుకున్న ఈ వినూత్న కార్యక్రమం విజయవంతం కావడం హర్షణీయమన్నారు. పిల్లల అభ్యసన అభివృద్ధికి ఉపాధ్యాయులు అద్భుత కృషి చేశారని అభినందించారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన 23 పాఠశాలలను, అత్యుత్తమ పనితీరు కనబరిచిన పది మంది కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఐదుగురు ఎంఈఓలను ఘనంగా సన్మానించారు. జిల్లాలో వినూత్నంగా ప్రవేశపెట్టిన ప్రాథమిక స్థాయి నోట్ పుస్తకాల ప్రాజెక్టు విజయవంతంలో కీలక పాత్ర పోషించిన 15 మంది ఆర్పీలను కూడా సత్కరించారు. అనంతరం టేకులపల్లి మండలం బొమ్మనపల్లి పాఠశాల విద్యార్థుల ప్రదర్శన అందరినీ మంత్రముగ్ధులను చేసింది. దీంతో స్పందించిన కలెక్టర్ వారికి నోట్ పుస్తకాలు, పెన్నులు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ ఎం. వెంకటేశ్వరాచారి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ సతీష్, సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల భవనం కూల్చివేత

పాల్వంచరూరల్: శిథిలావస్థకు చేరిన గిరిజన గురుకుల పాఠశాల భవనాన్ని మంగళవారం కూల్చివేశారు. మండలంలోని కిన్నెరసాని డ్యామ్ సైడ్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరిందని హెచ్‌ఎం ఎస్.శ్యామ్‌కుమార్ జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భవనాన్ని కూల్చివేశారు. కాగా, భవనాన్ని కూల్చివేసిన వ్యక్తికే అందులో ఉన్న ఇనుప సామగ్రి ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నట్లు ఏఈ శ్రీకాంత్, హెచ్‌ఏ తెలిపారు.



పాఠశాల భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

అడవులపై ఆదివాసీలకే హక్కులు

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్



మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్, పక్కన పీఓ రాహుల్, జలగం ప్రసాద్‌రావు తదితరులు

అశ్వారావుపేటరూరల్: అడవులపై ఆదివాసీలకే సంపూర్ణ హక్కు ఉంటుందని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. మండలంలోని కావడిగుండ్ల, గాండ్లగూడెం, పండువారిగూడెంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అటవీ ఫలాలతో పాటు ఏ విషయంలోనూ గిరిజనులకు అడ్డు చెప్పొద్దన్నారు. కొండరెడ్ల గ్రామాల్లో రోడ్లు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు అవకాశం ఇవ్వాలని అధికారులకు సూచించారు. అటవీ చట్టాల్లో ఏమైనా లొసుగులు ఉంటే సవరించాలన్నారు. పోడు పట్టాలున్న వారికి గిరి వికాసం పథకం కింద కరెంట్, బోర్లు, మోటార్లు ఇవ్వాలని కోరారు. ఐటీడీఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ.. గిరిజనుల్లో ఇంకా ఎవరైనా అర్హులుంటే సర్వే చేసి పోడు పట్టాలు ఇస్తామని చెప్పారు. కావడిగుండ్ల, గాండ్లగూడెంలో 60 మందికి హక్కు పత్రాలు ఇచ్చామన్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఐటీడీఏ ద్వారా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. గాండ్లగూడెం నుంచి చెన్నాపురం వరకు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామని, పనులు పూర్తి కాగానే ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కాగా, ఐటీడీఏ రుణాల మంజూరుకు ఓ ఉద్యోగి రూ.10వేల చొప్పున వసూలు చేస్తున్నాడని కావడిగుండ్ల సభలో గిరిజనులు ఫిర్యాదు చేయగా అతడిని సస్పెండ్ చేయాలని హుస్సేన్‌నాయక్ పీఓకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు, ఎఫ్‌డీఓ దామోదర్ రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ మహేందర్, డీడీ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవమి పనుల్లో నాణ్యత ఎంత..?

- ఆలస్యంగా ప్రారంభం కావడంతో భక్తుల్లో అనుమానాలు
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వేడుకోలు
- స్టేడియంలో ఓపెన్ షెడ్ నిర్మాణం ఈ ఏడాదికి లేనట్టే!
- ఇప్పటికీ పునాదులకే పరిమితమైన పనులు



కరకట్ట బొమ్మల వద్ద శుభ్రం చేస్తున్న కార్మికులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీరామనవమికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 6, 7 తేదీల్లో జరిగే శ్రీసీతారాముల కల్యాణం, పట్టాభిషేక బ్రహ్మోత్సవాలు ఈనెల 30న ఉగాది రోజున ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం పలు పనులు దేవస్థానం ఆధ్వర్యంలో చేపడతారు. ఈ మేరకు ఇటీవలే రూ.కోటి విలువైన పనులకు అధికారులు టెండర్లు ఖరారు చేశారు. భద్రాచలంలో మూడు వైపులతో పాటు పలు చోట్ల ఏర్పాటు చేసే స్వాగత ద్వారాలను సిద్ధం చేస్తున్నారు. మిథిలా స్టేడియం ప్రాంతంలో హోర్డింగ్‌లకు రంగులు అద్దుతున్నారు. కరకట్ట దిగువ భాగాన ఏర్పాటు చేసిన రామాయణ ఇతివృత్తాల బొమ్మలకు సైతం పెయింటింగ్ వేస్తున్నారు. కరకట్ట ప్రాంతాలను శుభ్రం చేస్తున్నారు. ఇక తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటుగా ఇతర పనులు ప్రారంభించాల్సి ఉంది.

ఓపెన్ షెడ్ లేనట్టే..

ప్రసాద్ పథకంలో భాగంగా మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ షెడ్ ఈ ఏడాది శ్రీరామనవమికి లేనట్టేనని స్పష్టమవుతోంది. ఈ ఓపెన్ షెడ్ నిర్మాణంలో నిర్లక్ష్యంపై ఫిబ్రవరి 22న సాక్షిలో 'నలభై రోజుల్లో నవమి.. పునాదుల్లో పనులు' అనే కథనం ప్రచురితమైంది. ఇందులో దేవస్థానం, టూరిజం ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఎత్తిచూపింది. అనుకున్నట్టుగానే ఈ ఓపెన్ షెడ్ నిర్మాణాన్ని ఈ నవమికి అందించలేమని సంబంధిత కాంట్రాక్టర్ జిల్లా ఉన్నతాధికారులకు తేల్చిచెప్పినట్లు సమాచారం. కేవలం పునాదుల వరకు మాత్రమే పూర్తి చేస్తామని చెప్పి ఆ పనులను ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇప్పటికీ ఆ పునాదుల పనులు మాత్రమే నడుస్తున్నాయి. ఇవి పూర్తయిన అనంతరం సెక్టార్ల విభజన, బారికేడింగ్ ఇతర పనులు చేపట్టాల్సి ఉంది. దీనిపై దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు సైతం పరిస్థితిని అంచనా వేసి టూరిజం శాఖ ఉన్నతాధికారులను అప్రమత్తం చేయాల్సి ఉండగా మనకెందుకులే అన్నట్టుగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి తలెత్తిందని భక్తులు అంటున్నారు. ఇప్పటికైనా ఇటు దేవస్థానం, అటు జిల్లా ఉన్నతాధికారులు ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని భక్తులతో పాటు భద్రాద్రి పట్టణ వాసులు కోరుతున్నారు.

హడావిడిగా పనులు చేయొద్దు..

ప్రతీ సంవత్సరం బ్రహ్మోత్సవాలకు నెలరోజుల ముందుగానే టెండర్లు ఖరారు చేసేవారు. అయితే ఈ ఏడాది ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడంతో ఈ ప్రక్రియలో చాలా ఆలస్యం జరిగింది. అయితే సమయం తక్కువగా ఉందనే సాకుతో పనులు హడావిడిగా, నాణ్యత లేకుండా చేపట్టే అవకాశం ఉంటుందని, దీనిపై అధికారులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. గతంలో ఎక్కువ సమయం ఉన్నప్పుడే నవమికి ముందు రోజు రాత్రి డివైడర్లకు, రోడ్లకు పెయింటింగ్ వేసి తూతూ మంత్రం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. అదే విధంగా ఏడాది పాటు ఖాళీగా ఉంచి నవమికి కొద్ది రోజుల ముందు పట్టణంలో పలుచోట్ల ఏర్పాటు చేస్తున్న శాశ్వత మరుగుదొడ్ల పనులను సైతం ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని కోరుతున్నారు.

'శానిటేషన్' ప్లాన్ రూపొందించండి

- కంపోస్టు డెవలప్‌మెంట్ అధికారి హేమలత
- 9 మున్సిపాల్టీల సిబ్బందికి ఇల్లెందులో ఒకరోజు శిక్షణ



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న హేమలత

ఇల్లెందు: ప్రతీ మున్సిపాలిటీలో 'సిటీ శానిటేషన్ ప్లాన్' రూపొందించుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్లు, శానిటేషన్ జవాన్లకు కంపోస్టు డెవలప్‌మెంట్ అధికారి హేమలత సూచించారు. నూరు శాతం జీరో బేస్డ్ శానిటేషన్ పట్టణాలుగా మార్చాలని, అందుకు అగ్రభాగాన ఉన్న ఇల్లెందు మున్సిపాల్టీలోని సక్సెస్‌ను అధ్యయనం చేసేందుకు వచ్చిన మహబూబాబాద్, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 9 మున్సిపాల్టీల అధికారులు, సిబ్బందికి ఇల్లెందులో మంగళవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. బైపాస్ రోడ్‌లోని డంప్‌యార్డులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హేమలత పలు అంశాలపై వివరించారు. ప్రతీ మున్సిపాల్టీలో చెత్త ఉత్పత్తి అయ్యే ప్రదేశాలను గుర్తించాలని, ఎంత మేర చెత్త లభిస్తుందో అంచనా వేయాలని సూచించారు. వర్మీ కంపోస్ట్ తయారీకి తడి చెత్త లభించే ప్రదేశాలను గుర్తించాలన్నారు. కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల మార్కెట్‌ను ఎంచుకోవాలని సూచించారు. ప్రతీ వారం సమీక్షలు నిర్వహించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబాబాద్, డోర్నకల్, తొర్రూర్, ఖమ్మం, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం, మణుగూరు మున్సిపాలిటీల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎం దేవేందర్‌గౌడ్, ఉద్యోగులు

చుంచుపల్లి: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ముత్యాల తలంబ్రాలను ఆర్టీసీ ద్వారా నేరుగా ఇంటికే పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టిందని కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం కొత్తగూడెం డిపోలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నవమి సందర్భంగా భద్రాచలం వెళ్లలేని భక్తులు ఆర్టీసీ కార్గో విభాగం ద్వారా రూ.151 చెల్లించి తలంబ్రాలను పొందవచ్చన్నారు. ఇందు కోసం ప్రత్యేక బుకింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్తగూడెం-91542 98599, పాల్వంచ-93473 40036, ఇల్లెందు- 83280 18525, గుండాల-95021 42298, ఆళ్లపల్లి-84650 70239 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది సునీత, జహీరుద్దీన్, రాములు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ హనుమ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

టేకులపల్లి: బీసీ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9 (ఇంగ్లిష్ మీడియం) తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ, ఈబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, తుది గడువు ఈనెల 31 వరకు ఉందని టేకులపల్లి ఎంజేపీ బాలుర గురుకుల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్ మంగళవారం తెలిపారు. ఏప్రిల్ 20 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు బోనఫైడ్, ఆధార్‌కార్డు, ఫొటోపై సంతకం, ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ పత్రం కలిగి ఉండాలని తెలిపారు.

తండ్రికి కుమార్తె తలకొరివి..



అంత్యక్రియల్లో శ్రీకరి

కొత్తగూడెంటౌన్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తాటిపల్లి రాజేశ్‌కుమార్‌కు పెద్ద కూతురు అంత్యక్రియలను నిర్వహించడం అందరినీ కలచివేసింది. కొత్తగూడెం న్యూగొల్లగూడెం రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉంటున్న 'సాక్షి'ఉద్యోగి తాటిపల్లి రాజేశ్‌కుమార్ ఈనెల 14న కారు ఢీకొని మృతిచెందిన విషయం విదితమే. మంగళవారం మృతుడి పెద్ద కూతురు శ్రీకరి తలకొరివి పెట్టింది. తండ్రికి ఏమైందో తెలియని వయస్సులో అంత్యక్రియలు నిర్వహించడంతో అందరూ కన్నీటిపర్యంతమయ్యారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక, నర్సాపురం గ్రామాల్లోని గోదావరి నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు సీఐ అశోక్ మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. తూరుబాక, నర్సాపురం గోదావరి పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య.. దాడి చేసి ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో తూరుబాకకు చెందిన చిట్టిమల్ల వెంకటేశ్, పాత మారేడుబాక వాసి జాబిశెట్టి రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.


మహ్మద్‌నగర్‌లో..

చండ్రుగొండ: మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామశివారులోని పెద్దవాగు నుంచి మంగళవారం రాత్రి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ పాపయ్య తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పెద్దవాగు నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ ఎస్కే యాకూబ్‌ను అదుపులో తీసుకున్నామని ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కల్లూరు: కల్లూరులోని తిరువూరు క్రాస్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ఇంకొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తిరువూరు క్రాస్ మీదుగా వెళ్తున్న కంటైనర్ కల్లూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా వెనక కూర్చున్న ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా వినన్నపేటకు చెందిన దుబ్బాక రాజారావు(50) అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే బైక్ నడుపుతున్న వెంకటేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు మృతుడి బంధువు ప్రసాద్ ఫిర్యాదుతోకేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,871

ఈత.. కావొద్దు గుండెకోత..



తరచూ ప్రమాదాలు జరుగుతున్న పాల్వంచలోని కేటీపీఎస్ కాల్వ

- నరదా కోసం వెళ్తే ప్రాణాలు హరీ
- కాపాడే ప్రయత్నంలోనూ మరణాలు
- ప్రతి వేసవి సీజన్‌లోనూ ఘటనలు
- పిల్లలపై తప్పనిసరి తల్లిదండ్రుల నిఘా

చుంచుపల్లి: జిల్లా విభిన్న వాతావరణానికి పెట్టింది పేరు. ఇక్కడ వర్షాలు, చలి, ఎండ.. అన్నీ ఎక్కువే. ప్రస్తుతం మార్చిలోనే పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 40 డిగ్రీలు దాటుతున్నాయి. ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం చిన్నారులు, యువకులు, పెద్దలు ఈత కొట్టేందుకు వ్యవసాయ బావులు, చెరువులు, కాల్వలు, కుంటలను ఆశ్రయిస్తుంటారు. నీటిలోతు తెలియక మునిగి విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. రాబోయేది నిండు వేసవి కాలం. విద్యార్థులకు ఒక్కపూట బడులు మొదలు కాగా మరికొన్ని రోజుల్లో వేసవి సెలవులు రానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు, యువకులు ఈతకు వెళ్లే సందర్భాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందే.

అత్యధిక ఉష్ణోగ్రతలు

వేసవి ఆరంభంలోనే జిల్లావ్యాప్తంగా రాష్ట్రంలోనే అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మండు వేసవిలో చిన్నారులు, యువకులు చెరువులు, కుంటలు, కాల్వల్లో ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతారు. ఈత మంచి వ్యాయామంతో పాటు ఆరోగ్యకరమే కానీ.. ఈత నేర్చుకోకుండా నీటిలోకి దిగడం చాలా ప్రమాదకరం. చిన్నారులు, యువకులందరికీ ఈత రాకపోవడం, ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరికలు లేకపోవడంతో స్నేహితులతో కలిసి నీటి వనరుల వద్దకు వెళ్లే పిల్లలు, యువకులు ప్రమాదాలను అంచనా వేయలేక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రమాదాలకు నిలయమైన చెరువులు, వాగులు, కుంటలు, కాల్వల వద్ద నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో గతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినా ఆచరణకు నోచుకోలేదు. ఈ మేరకు ఈత విషయంలో విద్యార్థులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తగిన అవగాహన కల్పించాల్సి ఉంది. అలాగే, కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలి. నీటి కుంటలు, వాగులు, పంట కాల్వలు, చెరువులు, వ్యవసాయ బావులు గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటాయి. అందుకే పొంచి ఉన్న ప్రమాదాల గురించి చిన్నారులను హెచ్చరించాలి. నిపుణులైన శిక్షకుల పర్యవేక్షణలో మాత్రమే ఈత నేర్పించాలి. నీట మునిగేవారిని కాపాడే ప్రయత్నంలోనూ కొందరు ఈత వచ్చినవారూ ప్రాణాలు కోల్పోతున్నారు. అగ్నిమాపక, పోలీస్ శాఖ, గజ ఈతగాళ్ల సహకారంతో, రక్షించే మెళకువలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

నిఘా అవసరం

- ప్రస్తుతం పాఠశాలలు ఒకటే పూట కొనసాగుతుండగా, త్వరలో వేసవి సెలవులు రానున్నాయి. దీంతో పిల్లలు ఎటు వెళ్తున్నారనే అంశంపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలి.
- ఈత రానికారణంగా గట్టుమీద ఉండేవారు సైతం కాసేపటికి నీటిలో దిగుతుంటారు. ఇదే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈత నేర్పించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

గతంలో జరిగిన కొన్ని ఘటనలు..

- 2023 ఏప్రిల్ 13న అశ్వారావుపేట ఉసిర్ల గూడేనికి చెందిన కొర్సా ఏసుబాబు (17) స్థానిక ఊర చెరువులో స్నేహితులతో కలిసి ఈతకు దిగి లోతు ఎక్కువగా ఉన్న ప్రదేశానికి వెళ్లి మృత్యువాత పడ్డాడు.
- 2023 ఫిబ్రవరి 28న భద్రాచలానికి చెందిన ఆరుగురు స్నేహితులు మేడువాయి వద్ద గోదావరిలో స్నానానికి వెళ్లారు. అందులో అక్బర్‌బాషా (17), పాలపర్తి వాసు (16) లోతు గమనించక గల్లంతై చనిపోయారు.
- పాల్వంచ బొల్లోరిగూడెం ఏరియాకు చెందిన సిద్దెల రీక్షిత్‌కుమార్ (11) 2022 మార్చి 14న స్నేహితులతో కలిసి కిన్నెరసాని నుంచి కేటీపీఎస్‌కు వెళ్లే నీటి కాల్వలో ఈతకు వెళ్లి నీళ్లలో మునిగి కొట్టుకుపోయి మృతి చెందాడు.
- కొత్తగూడెం సంజయ్‌నగర్ కాలనీకి చెందిన ఎస్‌డీ సోహెల్‌పాషా (17), అబ్దుల్ హమీద్, జక్కినబోయిన అనిల్‌కుమార్ (15) 2022 జూన్ 27న పాల్వంచ కిన్నెరసాని ప్రాజెక్ట్ నుంచి కేటీపీఎస్ వెళ్లే కాల్వలో ఈతకు వెళ్లి లోతు ఉండటంతో మునిగి చనిపోయారు.
- గతేడాది జనవరి 20న టేకులపల్లి మండలం సీతారాంపురానికి చెందిన బోడ అజయ్ (20) కొత్తగూడెంలో చదువుతూ స్నేహితులతో కలిసి పాల్వంచ కరగకవాగుకు ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు.

- ఈత విషయంలో పిల్లలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉంది.
- ఈత నేర్చుకునే సమయంలో పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి.
- బావులు, కాల్వలు, చెరువుల్లో ఈత కొట్టే ముందు వాటి లోతును ముందుగానే పరిశీలించాలి. తక్కువ నీరు ఉన్న ప్రదేశంలోకే వెళ్లాలి.
- ఈత కొట్టే సమయంలో సరదాలు, పందేలు, అత్యుత్సాహం వంటివి వద్దు. అవి ప్రాణాలకే ముప్పు తెస్తాయి.
- పూర్తిగా ఈత వచ్చే వరకు లోతైన ప్రాంతానికి వెళ్లొద్దు. ఈత నేర్చుకునే సమయంలో ట్యూబులు, బెండ్లు వాడుతున్నప్పటికీ శిక్షకులు లేకుండా జలవనరుల్లోకి దిగడం మంచిది కాదు.

రేక్ పాయింట్‌కు లైన్ క్లియర్

- పందిళ్లపల్లిలో ఎరువుల దిగుమతికి 'కోడ్' కేటాయింపు
- కంపెనీల సానుకూలతతో త్వరలోనే రవాణా

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని చింతకాని మండలం పందిళ్లపల్లిలో ఎరువుల రేక్ పాయింట్‌కు లైన్ క్లియర్ అయింది. వివిధ కంపెనీలు ఎరువుల సరఫరా చేసేలా కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖ తాజాగా 'కోడ్' కేటాయించింది. గతంలో ఖమ్మం రైల్వేస్టేషన్ కేంద్రంగా రేక్ పాయింట్ కొనసాగగా, కాజీపేట-విజయవాడ మధ్య మూడోలైన్ ఏర్పాటు పనులతో తొలగించి పందిళ్లపల్లి స్టేషన్‌కు మార్చింది. అయితే, అనుమతుల్లో జాప్యం జరుగుతుండగా దాదాపు మూడు నెలలుగా రైల్వేవ్యాగన్ల ద్వారా ఎరువుల సరఫరా నిలిచిపోయింది. దీంతో వరంగల్, మిర్యాలగూడ రేక్ పాయింట్ల నుంచి ఇక్కడకు ఎరువుల సరఫరా చేసి కేంద్రాలకు చేరవేస్తున్నా అక్కడక్కడా కొరత ఏర్పడింది. దీంతో కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖ కోడ్ కేటాయించిన నేపథ్యాన ఖమ్మం బదులు పందిళ్లపల్లికి ఎరువుల దిగుమతికి అవకాశం లభించినట్లయింది. ఇప్పటికే లారీ అసోసియేషన్ బాధ్యుల సమస్యల పరిష్కారం కాగా, హమాలీల సమస్య కూడా త్వరలో ఓ కొలిక్కి రానుంది.

నిల్వల కోసం ఎదురుచూపులు

రానున్న వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఎరువులు నిల్వ చేసేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమవుతోంది. ఏటా యాసంగి సీజన్ తర్వాత మార్చి నెల నాటికే దాదాపు 30 నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల వివిధ కంపెనీలకు సంబంధించి యూరియా నిల్వ చేస్తారు. మే నెల నాటికి ఇది 70 వేల మెట్రిక్ టన్నులకు చేరుతుంది. కానీ ఈసారి రేక్ పాయింట్ మారడం, అనుమతుల్లో జాప్యంతో నిల్వ చేయలేదు. పందిళ్లపల్లి రేక్ పాయింట్ నుంచే ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు ఎరువులు సరఫరా చేయనుండగా.. మార్క్‌ఫెడ్‌కు 60 శాతం, 40 శాతం డీలర్లకు కేటాయిస్తారు.

ముందుకొస్తున్న కంపెనీలు

పందిళ్లపల్లి రేక్ పాయింట్‌కు అనుమతులు వచ్చిన నేపథ్యాన ఎరువులు సరఫరా చేసేందుకు వివిధ కంపెనీలు రంగం సిద్ధమవుతున్నాయి. త్వరలోనే క్రిబ్‌కో, రామగుండం కంపెనీలతో పాటు మరికొన్ని కంపెనీల యూరియా దిగుమతి జరగనున్నట్లు తెలిసింది. ఒక్కో రైల్వే వ్యాగన్‌లో దాదాపు 3వేల మెట్రిక్ టన్నుల ఎరువులు రానుండగా, నెలకు 20 నుంచి 25 వ్యాగన్లు వచ్చే అవకాశముంది. దీంతో వానాకాలం సీజన్‌కు కావాల్సిన ఎరువులు నిల్వ చేసేందుకు గోదాంలను సిద్ధం చేస్తున్నారు. కాగా, పందిళ్లపల్లి రేక్ పాయింట్‌కు కోడ్ కేటాయించిన నేపథ్యాన ఎరువులతో పాటు ఎఫ్‌సీఐ తరఫున బియ్యం, గోధుమలు, మొక్కజొన్నల ఎగుమతి, దిగుమతికి కూడా అవకాశం లభించినట్లయింది.

ఆర్‌ఎంపీ హత్యకు మరో ఆర్‌ఎంపీ కుట్ర

కామేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స చేయాల్సిన వైద్యులు అర్హతకు మించి వైద్యం చేస్తూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలోనే తన ఆదాయానికి అడ్డొస్తున్నాడని భావించిన ఓ ఆర్‌ఎంపీ ఇంకొకరి హత్యకు యత్నించగా తృటిలో బయటపడ్డాడు. సింగరేణి మండలం కొత్తకమలాపురానికి చెందిన రంగారావు ఆర్‌ఎంపీగా గ్రామంలోనే కాక కామేపల్లి మండలం నెమలిపురితండాలోనూ చికిత్స చేస్తుంటాడు. అప్పటికే తండాలో ఆర్‌ఎంపీగా కొనసాగుతున్న వేముల రాధాకృష్ణ తన సంపాదనకు రంగారావు అడ్డొస్తున్నాడని భావించి హత్యకు కుట్ర పన్నాడు. రంగారావు ఈనెల 15న రాత్రి బైక్‌పై వెళ్తుండగా చౌటకుంట అలుగు సమీపాన రాధాకృష్ణ కారులో అడ్డు పెట్టి మరో ఐదుగురితో కలిసి రాడ్లతో దాడి చేయగా రంగారావుకు గాయాలయ్యాయి. ఇంతలోనే మరో బైక్ వస్తుండడంతో నిందితులు పారిపోయాడు. రంగారావు ఫిర్యాదుతో ఎస్సై సాయి కుమార్ విచారణ చేపట్టారు. దంతో రాధాకృష్ణ, నెమలిపురితండాకు చెందిన ధరావత్ నాగలక్ష్మి, ఈశ్వర్, ఖమ్మంకు చెందిన కుక్కల కార్తీక్, సుమంత్, వేణును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కంపగూడెం పాఠశాలకు అవార్డు



ములకలపల్లి: కలెక్టర్ చేతుల మీదుగా మెమెంటో అందుకుంటున్న హెచ్‌ఎం సుజాత

ములకలపల్లి: మండలంలోని కంపగూడెం ప్రభుత్వ పాఠశాలకు బాలమేళాలో అవార్డు లభించింది. బాలమేళాలో భాగంగా ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (లిటరసీ, న్యూమరసీ) అంశాల్లో కంపగూడెం పాఠశాల గత నెలలో ఎంపికైంది. మండలంలోని 48 పాఠశాలలకు గాను కంపగూడెం పాఠశాలను బెస్ట్ స్కూల్‌గా విద్యాశాఖాధికారులు ఎంపిక చేశారు. మంగళవారం కొత్తగూడెంలో నిర్వహించిన సమ్మేళనంలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, డీఈఓ వెంకటేశ్వరాచారి, హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయురాలు కీసరి జయసుధను సత్కరించి, మెమెంటో అందజేశారు.



దమ్మపేట: ఎంఈఓ లక్ష్మికి ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ పాటిల్, డీఈఓ వెంకటేశ్వరాచారి

ఎంఈఓకు ప్రశంస

దమ్మపేట: విధి నిర్వహణలో ఉత్తమంగా వ్యవహరించిన స్థానిక ఎంఈఓ కీసర లక్ష్మిని మంగళవారం కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అభినందించారు. బాలమేళా కార్యక్రమ నిర్వహణతో పాటుగా విధులను అంకితభావంతో సమర్థవంతంగా నిర్వహించిన దమ్మపేట ఎంఈఓ లక్ష్మి.. జిల్లాస్థాయిలో ఉత్తమ ఎంఈఓగా ఎంపికయ్యారు. కొత్తగూడెంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాలమేళాలో మండలంలోని జగ్గారం ప్రాథమిక పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ఎంఈఓ లక్ష్మితో పాటుగా జగ్గారం పాఠశాల హెచ్‌ఎం పుష్పకుమారిని కలెక్టర్ సత్కరించారు. ప్రశంసాపత్రాలను అందజేశారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ ప్రమాదాల నివారణపై ఓఅండ్‌ఎం ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నామని విద్యుత్ ఎస్‌ఈ జి.మహేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల భద్రతపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని, ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తూ వారికి భద్రతా పరికరాలు అందజేస్తున్నామని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి కింది నుంచి పైస్థాయి అధికారుల వరకు సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. నిరంతర శిక్షణ, భద్రతా పద్ధతులను బలోపేతం చేయడం వల్ల సంస్థలో భద్రతా ప్రమాణాలను పెంచగలుగుతున్నామని ఎస్‌ఈ వివరించారు.

పాటించాల్సిన సూచనలు..

- సెక్షన్ ఇన్‌చార్జ్ ప్రతీ రోజు 15 నిమిషాలు పనికి ముందు భద్రతా చర్యల గురించి సిబ్బందితో చర్చించాలి
- అనుమతి కలిగిన అధికారి తగిన జాగ్రత్తతో మాత్రమే లైన్‌క్లియర్ ఇవ్వాలి. ఫోన్ ద్వారా లైన్ క్లియర్లు ఇవ్వడాన్ని నివారించాలి.
- విధులలో ఉన్న ఎస్‌ఎల్‌ఐ/ఎల్‌ఐ బ్రేక్‌డౌన్ వర్క్ లొకేషన్ వద్ద ఉండాలి. లైన్ డిశ్చార్జ్ చేయబడిందని, పని నిర్వహించడానికి సురక్షితంగా ఉండేలా చూసుకోవాలి
- ఫీల్డ్ సిబ్బందికి అన్ని భద్రతా పరికరాలను అందుబాటులో ఉంచాలి. తప్పనిసరిగా వినియోగించేటట్లు చూడాలి
- హెచ్‌టీ/ఎల్‌టీ లైన్ల పనిని ప్రారంభించే ముందు చేతి తొడుగులు, ఎర్త్ డిశ్చార్జి రాడ్, ఓల్టేజీ డిటెక్టర్ తప్పనిసరిగా తీసుకువెళ్లాలి.
- లైన్ సమీపంలో ఓల్టేజీ డిటెక్టర్‌ను ఉంచడం, ఎర్త్ డిశ్చార్జ్‌రాడ్‌ను తాకడం ద్వారా లైన్‌డెడ్‌గా ఉందని నిర్ధారించుకోవాలి. లైన్‌కు రెండు వైపులా సరైన ఎర్తింగ్ కోసం అన్ని దశల్లో ఎర్త్ డిశ్చార్జ్ రాడ్‌ను ఉపయోగించాలి
- 33 కేవీ, 11 కేవీ లైన్‌కు సంబంధించి సింగిల్ నమూనా రేఖా చిత్రాన్ని ప్రతి సెక్షన్ ఆఫీస్ వద్ద.. ఏబీ స్విచ్, డబుల్ పాయింట్ ఆఫ్ సప్లై, హెచ్‌టీ లైన్ క్రాసింగ్ లొకేషన్ సూచిస్తూ ప్రదర్శించాలి. ప్రతి ఉద్యోగి ఒక కాపీని అందుబాటులో ఉంచుకోవాలి
- బ్రేకర్లు, రిలేల సరైన పనితీరును నిర్ధారించడం, విశ్వసనీయ రక్షణ కోసం ఫీడర్, ఎల్‌వీ బ్రేకర్స్ రిలేల్లో తగిన ఈ/ఎల్, ఓ/ఎల్ సెట్టింగులను మార్చాలి
- సెక్షన్ ఆఫీసర్, సబ్ డివిజన్ ఆఫీసర్ వద్ద బ్రేక్‌డౌన్ల సమాచారం, నిర్వహణ పనులు చేసిన ఫీల్డ్ సిబ్బంది పేర్లు ఉండాలి.
- మెయింటెనెన్స్, ఔట్ వర్క్ జరుగుతున్న ప్రాంతంలో సెక్షన్ ఆఫీసర్/ఏడీఈ ఆకస్మిక తనిఖీ చేయాలి. భద్రతా ప్రక్రియలో ఏదైనా ఉల్లంఘన ఉన్నట్లు గుర్తిస్తే చర్యలు తీసుకోవాలి
- డివిజనల్ ఇంజనీర్/టెక్నికల్/సర్కిల్ కార్యాలయ సేఫ్టీ ఆఫీసర్ ఓఅండ్‌ఎం సిబ్బంది భద్రతా నిబంధనలకు లోబడి పనిచేస్తున్నారో లేదో ఆకస్మిక తనిఖీలు చేయాలి.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ఇల్లెందు: తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని ఓ ప్రేమ జంట పోలీసులు, న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన కందిపాటి తరుణ్, అదే ప్రాంతంలోని క్యాంపుతండాకు చెందిన ధరావత్ మమత ఇల్లెందు చెరువుకట్ట పెద్దమ్మ తల్లి ఆలయంలో కులాంతర వివాహం చేసుకున్నారు. మమత తల్లిదండ్రులు ఈ పెళ్లిని అంగీకరించటం లేదని, పోలీసులకు ఫిర్యాదు చేశారని, కొందరితో దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ప్రేమజంట తెలిపింది. ఇల్లెందులపాడుకు చెందిన సిద్ధంకి వెంకన్న (వరుడి తాత) ఇంటి వద్ద ఉండి జీవనోపాధి చూసుకుంటామని, తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు. ప్రేమజంట ఫిర్యాదును పరిశీలించిన న్యాయమూర్తి తగుచర్యలు తీసుకోవాలని డీఎస్పీని ఆదేశించారు. ఈ విషయమై సీఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి గాయపడిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని అనంతారం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న విజయలక్ష్మి తన ద్విచక్రవాహనంపై అనంతారం వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలోని రామన్నగూడెం టేకు ప్లాంటేషన్ వద్ద ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కార్యదర్శి తలకు గాయాలు కాగా, అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలించారు.

పశువులు తరలిస్తున్న వ్యాన్ పట్టివేత



పశువులను తరలిస్తూ పట్టుబడిన వ్యాన్

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా పశువులను కబేళాకు తరలిస్తుండగా సోమవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. ఏపీలోని విజయనగరం జిల్లా అలమంద సంత మార్కెట్‌లో కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండానే 8 ఆవులు, 4 ఎద్దులను వ్యాన్‌లో హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్పెషల్ బ్రాంచ్ పోలీసులు దాడి చేసి స్థానిక రింగ్ రోడ్ వద్ద పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వ్యాన్‌ను సీజ్ చేసి, మూగజీవాలను పాల్వంచలోని గోశాలకు తరలించారు. వ్యాన్ యజమాని, డ్రైవరు ఓర్సు శ్రీను, క్లీనర్ అల్లపు వెంకటేశ్, దళారీ మానేపాటి ఎల్లయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతిపై బాబాయి దాడి..

కేసు నమోదు



తీవ్రంగా గాయపడిన శ్రీలత

ఇల్లెందురూరల్: తండ్రి లాంటి వ్యక్తి.. తన అన్న కూతురిపై దాడి చేసి గాయపర్చిన ఘటన మండలంలోని ఒడ్డుగూడెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఒడ్డుగూడేనికి చెందిన శ్రీలత కుటుంబానికి.. ఆమె బాబాయ్ జగదీశ్ కుటుంబానికి మధ్య ఇంటి స్థలం విషయంలో గొడవలు జరగుతున్నాయి. మంగళవారం కూడా గొడవ జరగడంతో జగదీశ్.. శ్రీలతపై దాడి చేసి గాయపర్చాడు. కుటుంబ సభ్యులు ఆమెను ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీలత తండ్రి వీరభద్రం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

నేలకొండపల్లి: అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగా, కుటుంబీకులు నిద్ర నుంచి మేల్కొని బయటకు వచ్చేలోగా సర్వం అగ్నికి ఆహుతవడంతో కట్టుబట్టలు మాత్రమే మిగిలాయి. మండలంలోని కొత్తకొత్తూరుకు చెందిన కస్తూరి పద్మకు చెందిన ఇంట్లో సోమవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. నిద్రలో ఉన్న పద్మ, కుటుంబ సభ్యులు మేల్కొని బయటకు పరుగులు తీయగా మంచాలు, బట్టలు, బీరువా, కూలర్ తదితర సామగ్రి కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చేలేగా ఏమీ మిగలకపోగా, ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తూ పద్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఓ వ్యక్తి తనను చంపుతానని బెదిరించాడని, ఆయనే ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పాఠశాలలో వీరంగం

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రాపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. పాఠశాల తరగతి గది, ఆఫీస్ రూం తలుపులు పగలగొట్టి, టేబుళ్లు, పుస్తకాలు పడేశారు. స్థానికులు రావడంతో అక్కడి నుంచి పారిపోయారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బూర్గంపాడు: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బూర్గంపాడు మండలంలోని అంజనాపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బానావత్ నారాయణ (56) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి ఇంట్లో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి రెండేళ్ల జైలు

బూర్గంపాడు: మండలంలోని సోంపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహితపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తు భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ మంగళవారం తీర్పునిచ్చారు. 2022 మార్చి 26వ తేదీ రాత్రి సోంపల్లి గ్రామానికి చెందిన ఓ వితంతువుపై అదే గ్రామానికి చెందిన నస్కూరి శ్రీను లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జితేందర్ కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నేరం నిరూపితం కావటంతో మెజిస్ట్రేట్ ముద్దాయికి జైలు శిక్ష విధించారు.

రేషన్ బియ్యం సీజ్

దమ్మపేట: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో ఓ ఇంట్లో రేషన్ బియ్యంను నిల్వ చేశానే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఆటో, మినీవ్యాన్‌లో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

టేకులపల్లి: మండలంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. పదమూడేళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు సోమవారం రాత్రి ఊరుచివరికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు తెలపడంతో మంగళవారం రాత్రి టేకులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఎస్‌ఐ సురేశ్ సదరు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.